
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
గురువారం, 30 జనవరి 2025




'తారక మంత్రము కోరిన దొరికెను...'

- వీనులవిందు చేసే భక్త రామదాసు కీర్తనలు ఎన్నో..
- ఆ అపర వాగ్గేయకారుడి సాహిత్యంపై కానరాని ప్రచారం
- నేటి తరానికి తెలియకుండా పోతున్న అద్భుత కృతులు
- నిర్లిప్తంగా వ్యవహరిస్తున్న దేవస్థానం బాధ్యులు
- సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ధ్యాన మందిరం
- స్పష్టత లేని కీర్తనల శిలా ఫలకాలు

భద్రాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పలుకే బంగారమాయెనా.. కోదండపాణీ../ తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా../పాహి రామప్రభో.. పాహి రామప్రభో../ ఏ తీరుగ నను దయ చూచెదవో.. ఒకటి కాదు, రెండు కాదు అద్భుతమైన వేలాది కీర్తనలు అపర వాగ్గేయకారుడు భక్త రామదాసు సొంతం. ఆయన సృజించిన సాహిత్యం... తెలుగుజాతికి తరగని సంపద. ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గళం నుంచి జాలువారిన రామదాసు కీర్తనలు వీనుల విందు చేసి సంగీతంలో ఓలలాడిస్తాయి. అయితే తరాలు మారుతున్న కొద్దీ అలాంటి అపురూప సాహిత్యం కనుమరుగవుతోంది. నేటి తరానికి ఆ సాహిత్య పరిమళాలను మరింతగా విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత భద్రాద్రి దేవస్థానంపై ఉన్నా.. ఆ దిశగా పూర్తిస్థాయిలో ప్రచారం లేదనే భావన రామభక్తుల్లో వినిపిస్తోంది. భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై ధ్యాన మందిర నిర్మాణం జరిగి ఐదు దశాబ్దాలు దాటినా.. (మిగతా 6వ పేజీలో)

ఒకటి నుంచి వాగ్గేయకారోత్సవాలు 6

జల పుష్పాల జాతర

భద్రాద్రి జిల్లా కరకగూడెం సమీపంలోని పెద్ద చెరువులో బుధవారం జల పుష్పాల జాతర కనిపించింది. చెరువులో నీటిమట్టం తగ్గుతున్న క్రమంలో ముందే నిర్ణయించుకున్న ప్రకారం ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చి చేపల వేటలో మునిగితేలారు. కరకగూడెం, అనంతారం, తాటిగూడెం, వెంకటాపురం, దేవరనాగారం, చిరుమళ్ల, రాయణపేట, పద్మాపురం, రఘునాథపాలెం, గొల్లగూడెం, మోతే, భట్టుపల్లి, సమత్ భట్టుపల్లి గ్రామాల నుంచి జనం వలలు, ఊతలతో తరలివచ్చి చేపలు పట్టారు. ఈ క్రమంలో చెరువంతా జనమయమై కనిపించింది.

-ఆంధ్రజ్యోతి, కరకగూడెం



'పంచాయతీ' పోరుకు రెడీ



ఫిబ్రవరిలో 'స్థానిక' ఎన్నికలు ఉంటాయని సంకేతాలు

- కేడర్‌ను అప్రమత్తం చేస్తున్న పార్టీలు
- సంక్షేమ పథకాలపైనే అధికార పార్టీ ఆశలు
- 'పల్లె' పోరులో సత్తా చాటాలని విపక్షాల దూకుడు
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

ఖమ్మం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజున ప్రతిష్టాత్మకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇక త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ కూడళ్లలో తీవ్రంగా జరుగుతోంది. ఫిబ్రవరి మొదటి వారంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందన్న ప్రచారంతో రాజకీయపార్టీలు సైతం ఆ ఎన్నికలపై దృష్టి సారించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికలే లక్ష్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభ కార్యక్రమాల్లో మంత్రులు సైతం పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని కేడర్‌కు సందేశం ఇచ్చారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఎన్నికల హామీలు అమలవుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'ప్రత్యేక' పాలనలో పేరుకుపోయిన సమస్యలు

ఏడాది కాలంగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. గ్రామాల్లో ప్రజా పాలకవర్గాలు లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. తాగునీటి సమస్య, పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూళ్ల తదితర కార్యక్రమాల్లోనూ ఇబ్బందులున్నాయి. వార్డు స్థాయి సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రత్యేక అధికారులు కూడా గ్రామాల్లో సరిగా అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానిక సంస్థల పాలన గాడితప్పుతోంది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా ఎవరు జోక్యం (మిగతా 6వ పేజీలో)

సిద్ధమవుతున్న విపక్షాలు..

జిల్లాలో పంచాయతీ ఎన్నికలతో మళ్లీ గ్రామాల్లో బలం పెంచుకోవాలని విపక్షాలు కూడా పోరుకు సిద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్‌తో పాటు సీపీఎం, సీపీఐ, బీజేపీ, టీడీపీలు పంచాయతీ ఎన్నికల్లో పోరుకు దిగాలని ఇప్పటికే కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నాయి. గెలుపోటములను పక్కనపెట్టి బరిలో ఉండడం ద్వారా గ్రామాల్లో బలం పెంచుకోవాలని భావిస్తున్నాయి. కాగ్రెస్‌లో వర్గవిబేధాలు కూడా తమకు కలిసొస్తాయని విపక్షాలు ఆశిస్తున్నాయి. కొన్ని పార్టీలో కాంగ్రెస్ వర్గాల్లో ఏదో ఒక వర్గాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని పంచాయతీ ఎన్నికల్లో సత్తా చూపించాలనే ఆలోచనలో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే విపక్ష పార్టీలు దూకుడు పెంచే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం

ప్రభుత్వం పంచాయతీ షెడ్యూల్ ఎప్పుడు ప్రకటించినా ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉంది. ఖమ్మం జిల్లా పరిధిలో 589 పంచాయతీలు, 5,893 వార్డులున్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు 5,438మంది సిబ్బందిని కూడా అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు 8,64,702మంది ఓటర్లు ఉన్నారు. బ్యాలెట్ బాక్సులతో పాటు బ్యాలెట్ పేపర్లు కూడా అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రచురించింది. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 పంచాయతీలుండగా 4,232వార్డులు, 7,33,942మంది ఓటర్లు ఉన్నారు. అక్కడకూడా ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచారు.

సీడీసీ చైర్మన్‌గా 'యరబోలు'



కూసుమంచి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సీడీసీ (కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) చైర్మన్‌గా కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన యరబోలు సూర్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ కేన్ కమిషనర్ మల్సూర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుల మేరకు రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్స్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు నూతన కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం మూటాపురం గ్రామానికి చెందిన గుడిమళ్ల మధు, చెన్నారం గ్రామానికి చెందిన జోగుపర్తి కృష్ణారావు, ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, డిప్యూటీ జీఎం అప్పారావును సభ్యులుగా నియమించారు. మూడేళ్లపాటు ఈ కౌన్సిల్ కొనసాగనుంది. కాగా, మంత్రి పొంగులేటి ఆశీస్సులతోనే సీడీసీ పదవి లభించిందని సూర్యనారాయణరెడ్డి తెలిపారు. చెరకు కర్మాగారం అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గంలోకి 'నున్నా'

రాష్ట్ర కమిటీలోకి మరికొందరు నాయకులు



ఖమ్మం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శివర్గంలో చోటు దక్కించుకున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా పోతినేని సుదర్శన్ కొనసాగుతుండగా.. నూతనంగా నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. 2015 నుండి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 2017 నుండి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు (మిగతా 6వ పేజీలో)



అర్బన్ తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయాలి...

- సర్వేలు, గ్రామసభల పేరుతో కాలయాపన తగదు
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతలు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయటం లేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులను ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు బుధవారం ఖమ్మం అర్బన్ తహసిల్దారు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో నిరుపేదలే ప్రమాణికంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని, ఇందిరమ్మ కమిటీల జోక్యం ఉండకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించి ఇప్పుడు సర్వేలు, గ్రామ సభలు పేరుతో కాలయాపన చేస్తొందన్నారు. లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే వరకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నిర్విరామ పోరాటాలు చేస్తొందని హెచ్చరించారు. అంతకుముందు నయాబజార్ కాలేజీ నుంచి తహసిల్దారు కార్యాలయం వరదకు నిరసన ర్యాలీ చేపట్టారు. నాయకులు ఝాన్సీ, కే శ్రీను, సత్తార్, కే శ్రీనివాస్, నర్సింహారావు, లెనిన్, జాన్సిన్, రామారావు, శారధ, సుజాత, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీజీ పరీక్షల్లో 8 మంది డీబార్

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని కాకతీయ విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అన్నారు. బుధవారం నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో మ్యాక్స్ బీఈడీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాపీయింగ్‌కు తావులేకుండా విజయవంతంగా పరీక్షలు పూర్తిచేయాలని అన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 8మందిని డీబార్ చేసినట్టు తెలిపారు. పీజీ కళాశాలలో పీజీ థర్డ్‌సెమ్ నలుగురు విద్యార్థులు, ఇద్దరు కవిత కాలేజీలో ఇద్దరు, మ్యాక్స్ బీఈడీ కాలేజీలో ఇద్దరు మొత్తం 8 మంది కాపీ రాస్తూ పట్టుబడ్డారని తెలిపారు. విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే ఇబ్బందుల పాలవుతారన్నారు. ఆయన వెంట పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ సౌజన్య పాల్గొన్నారు.

ఐటీసీలో ఎన్నికల సందడి

- రేపు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- సారపాకలో యూనియన్ల ప్రచారం పూర్తి
- మొదలైన బేరసారాలు.. ఓటు వేయనున్న 1,253 మంది

7

మూడో రైల్వేలైన్ ట్రయల్‌రన్ సక్సెస్

- ప్రారంభించిన సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి
- పందిళ్లపల్లి నుంచి మోటమర్రి వరకు పనులు పూర్తి
- మోటమర్రి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగారా



- ఫిబ్రవరి 27న పోలింగ్... మార్చి 3న ఫలితాలు
- ఖమ్మం జిల్లాలో 3,955మంది, భద్రాద్రి జిల్లాలో 1,038 మంది
- ఉపాధ్యాయ వర్గాల్లో మొదలైన సందడి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం- నల్గొండ- వరంగల్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల షెడ్యూల్ ప్రక్రియను ప్రకటించింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29 నాటికి గడువు మీరుతున్న నేపథ్యంలో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్టంలో మెదక్, నిజామాబాద్ ఆదిలాబాద్, కరీంనగర్, గ్రాడ్యుయేట్ ఎన్నికలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం ఇప్పటికే పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే నామినేషన్ల గడువు నాటికి కూడా ఓటర్ల నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించనుంది. ఇంకా ఓటుహక్కు రాని పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించింది.

షెడ్యూల్ ఇలా...

ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు వీలుగా బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 10 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 27న ఎన్నికలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలను వెల్లడిస్తారు. దీంతో మార్చి 5 నాటికి ఎన్నికలు పూర్తిచేస్తారు.

ఉపాధ్యాయ ఓటర్లు ఇలా..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,955 మందిలో పురుష ఉపాధ్యాయులు 2,300 మంది ఉండగా.. మహిళలు1,655 మంది ఉన్నారు. అయితే జిల్లాలో ప్రస్తుతం 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించడంతో పాటు 3న నోటిఫికేషన్ విడుదలయ్యే ఆస్కారం ఉండడంతో మళ్లీ రాజకీయాలు వేడెక్కనుంది.

భద్రాద్రి జిల్లా ఓటర్లు ఇలా..

పురుష ఓటర్లు 1038, మహిళలు 911, మొత్తం ఓటర్లు 1949, పోలింగ్ స్టేషన్లు 23.

మోడల్‌గా కేఎంసీ డంపింగ్ యార్డు

- ఏ రోజు వ్యర్థాలు అదే రోజు శుద్ధి
- 5 వేల మొక్కల పెంపకం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని డంపింగ్‌యార్డును ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే మోడల్ డంపింగ్ యార్డుగా రూపాంతరం చెందుతుందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం డంపింగ్‌యార్డును మేయర్ తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులో నాటిన మొక్కలను పరిశీలించారు. డంపింగ్ రహదారికి వెళ్తున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని వ్యర్థాలను శుద్ధి చేసి ఆ ప్రాంతంలో ఇప్పటికే 5 వేలకు పైగా మొక్కలను నాటి వాటిని సంరక్షించడం జరిగిందన్నారు. ఏ రోజు వ్యర్థాలను అదే రోజు శుద్ధి చేసే యంత్రాలను ఖమ్మం డంపింగ్ యార్డుకు తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి డంపింగ్ శుద్ధి ఖమ్మంలోనే తొలి సారిగా ఏర్పడుతుందన్నారు. ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దంపింగ్ యార్డులో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ



మన్యంపై మంచుదుప్పటి



మన్యంలో పొగ మంచు తెల్లవారుజాము నుంచే వర్షపు జల్లులా కురవడంతో గ్రామాలపై మంచు దుప్పటి కమ్మేసింది. ఆళ్లపల్లి మండలంలో బుధవారం పొగమంచు కమ్ముకోవడంతో ఎనిమిది దాటినా సూర్యకిరణాలు పుడమిని తాకలేదు. మంచుకు తోడు.. చలి ఎక్కువగా ఉండటంతో పల్లెల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ఏజెన్సీ వాసులు చలికి వణుకుతున్నారు. మంచు అధికంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

మంచుపొగలో ఇప్పుడే నిద్ర లేస్తున్నట్టుగా వస్తున్న సూర్య కిరణాలు మర్కోడు రేగడి చెరువు దగ్గర తాటివనంపై పడటంతో చెరువు నీటిలో తాటివనం ప్రతిబింబపు అందాలు చూడముచ్చటగా కనువిందు చేసింది. -ఆంధ్రజ్యోతి, ఆళ్లపల్లి

జిల్లా ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గోవిందరావు



చింతకాని, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొప్పుల గోవిందరావు ఎన్నికయ్యారు. మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన గోవిందరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మధిర నియోజవకర్గం తరపున జిల్లా కమిటీలో సభ్యుడిగా కొప్పుల గోవిందరావును ప్రతిపాదించారు. జిల్లా ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్నెట్ వైఫల్యమే ఖాతాల స్తంభనకు కారణం

ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కొన్ని బ్యాంకుల్లో రైతుల ఖాతాలు స్తంభించాయని రైతులు ఆందోళన చెందుతున్నారని, ఈ ఖాతాల స్తంభనకు బ్యాంకులకు అనుసంధానం అయిన అంతర్జాలంలో తలెత్తిన సాంకేతిక సమస్యలు వల్లేనని, ఆయిల్‌ఫెడ్ వల్ల కాదని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయిల్‌ఫెడ్ రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు స్తంభించినట్టు పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారని, వారి సమాచారం మేరకు ఇప్పటికే ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా ఆదేశాలతో బ్యాంకు అధికారులతో సంప్రదించడం జరిగిందని, ఏపీజీవీబీగా ఉన్న బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారడంతో ఏర్పడిన సాంకేతిక కారణాలతోనే బ్యాంకు ఖాతాలు స్తంభించాయని గుర్తించడం జరిగిందని, బ్యాంకులతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



పట్టాలతో రైతులు

400 మంది రైతులకు అటవీ హక్కు పత్రాల పంపిణీ

భద్రాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కరకగూడెం మండలం రేగళ్ల ప్రాంతానికి చెందిన 400మంది గిరిజన రైతులకు బుధవారం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అనేక ఏళ్ల పోరాటం, కోర్టు కేసుల పరిష్కారం అనంతరం పట్టాల పంపిణీ జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ అటవీ భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు ఐక్యంగా ఉద్యమించడంతో పట్టాల పంపిణీ జరిగిందన్నారు. తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టరు కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు, పాదయాత్రలు, దశలవారీ ఆందోళనలు నిర్వహించామన్నారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా... ఆరు నెలలు సర్వేల పేరుతో కాలయాపన చేసి ఎట్టకేలకు పట్టాలు అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాంకుడోతు కోబల్, తేజావత్ వెంకన్న, వాంకుడోతు సురేష్, వాంకుడోతు సీతారాం, బానోతు మల్సూర్, సేవాలాల్ హనుమంతు, దరియా శంకర్, సాదు లక్ష్మణ్, రాందాస్, శీను, బాల్య, సారయ్య పాల్గొన్నారు.

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి



ఖమ్మం బైపాస్ రోడ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి ఢిల్లీ నగరంలో కూడా జరగాలని, దానికి డబుల్ ఇంజన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. అవినీతి అరవింద్ కేజ్రీవాల్‌ను గద్దెదించాలని కోరారు.

చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి ఆర్థిక లబ్ధి పొందాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



భద్రాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు స్వశక్తితో జీవనోపాధి పెంపొందించుకొని ఎంఎస్ఎం పథకం ద్వారా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం తన ఛాంబర్లో సూరప్ప ఫ్లై యాష్ బ్రిక్స్ యూనిట్ నిర్మాణం చేపట్టడానికి రెండో విడత రూ.9 లక్షల చెక్కును యూనిట్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు రూ.15 లక్షల సబ్సిడీతో రూ.25 లక్షల ఖర్చుతో నిర్మాణం చేపట్టిన సూరప్ప ఫ్లై యాష్ బ్రిక్స్ యూనిట్ ద్వారా సిమెంటు ఇటుకలు తయారు చేసి వాటి అమ్మకాల ద్వారా వారు జీవనోపాధి పొందడమే కాక పదిమందికి ఉపాధి కల్పించి ఆర్థికంగా చూయతనందించాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ, సభ్యులు ఆంజనేయులు, మానస, రాధమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో నెలకొల్పిన శ్రీలక్ష్మీ గణపతి మహిళ గిరిజన లియోబిలిటీ గ్రూపు న్యూట్రిషన్ మిక్స్ అండ్ మిక్స్ యూనిట్‌ను పీవో ప్రారంభించారు. రూ.40లక్షలతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను గిరిజన మహిళలందరూ కలిసికట్టుగా ఉండి నడుపుకోవాలని కోరారు.



పులిగుండాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

‘పులిగుండాల’కు సందర్శకులు పెరిగేలా చర్యలు

- ఫిబ్రవరి నుంచి ఎకో టూరిజం ప్రారంభానికి సన్నాహాలు
- ఐదు కిలోమీటర్లు నడిచి సందర్శించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణం.. పచ్చని అడవి.. కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టును ఎకో టూరిజం ప్రాజెక్టుగా ఫిబ్రవరి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కనకగిరి రిజర్వు ఫారెస్టులోని పులిగుండాల ప్రాజెక్టును ఖమ్మం నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి సందర్శించారు.పులిగుండాల ప్రాజెక్టు నుంచి వాటర్‌ఫాల్ వరకు ఐదు కిలోమీటర్లు నడిచి గుట్టపైకి ఎక్కి సందర్శించారు. ఎకో టూరిజం ప్రణాళికలో భాగంగా కలెక్టర్ కమాండర్ జీపులో ప్రయాణించి అడవిని తిలకించారు. పాలపిట్ట ఏరియల్ టవర్ ఎక్కి బైనాక్యులర్ ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. ప్రకృతి పరంగా గుట్టలు, చెరువుల నుంచి జాలువారే నీళ్లతో అటవిని పర్యాటరంగంగా అభివృద్ధి చేసుకోవాలని దీని ద్వారా ఆరోగ్యకరమైన సంపద వస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రకృతిని కాపాడుకోలేకే మనకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వాటిని నివారించేందుకు అడవులను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల కోసం పులిగుండాల ప్రాజెక్టులో బోటింగ్‌తోపాటు ఈ ప్రాంతంలో వసతి, కాటేజీ, భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో దీక్షా రైనా, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, అటవీ రేంజ్ అధికారి జి.ఉమ, డీఆర్వో రామ్‌సింగ్ సురేష్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘తారక మంత్రము కోరిన దొరికెను...’

(5వ పేజీ తరువాయి)

అది నిరుపయోగంగానే ఉంది. భక్తరామదాసు గళం, కలం నుంచి జాలువారిన అజరామరమైన కీర్తనలను శిలాఫలకాలపై చెక్కినా.. అవి ప్రస్తుతం స్పష్టంగా కనిపించడం లేదు.

తెలుగువారిలో ఆయన పేరు తెలియని వారు, ఆయన కీర్తనలు వినని రామ భక్తులు, సంగీతాభిమానులు లేరంటే అతిశయోక్తి కాదు. ఎన్నో అజరామరమైన రాగాలలో కీర్తనలు ఆలపించడమే కాదు.. రామదాసు గళం, కలం నుంచి జాలువారిన పదాలన్నీ కమనీయమే. తన ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యను స్మరిస్తూ వందలాది కీర్తనలను ఆయన రచించి గానం చేశారు. ఇందులో ప్రస్తుతం నాదనామక్రియ, ఆనంద భైరవి, కాంబోజి, శంకరాభరణం, వరాళి, పున్నాగవరాళి, కల్యాణి, యమునా కల్యాణి, సావేరి, అసావేరి తదితర 38 రాగాలలో 196 కీర్తనలు అందుబాటులో ఉన్నాయని పరిశీలకులు, పరిశోధకులు చెబుతున్నమాట. ఇందులో 16 సంస్కృత కీర్తనలు కూడా ఉన్నాయి. ఆనందభైరవి రాగాన్ని తొలిసారిగా ఉపయోగించిన ఘనత భక్తరామదాసుకే దక్కింది. అంతటి మహనీయుని సాహిత్యసుగంధం నేటితరానికి అందించాల్సిన దేవస్థానం ఆ దిశగా చేస్తున్న సేవలు అంతంత మాత్రంగానే వున్నాయి.

ఒకటి నుంచి వాగ్గేయకారోత్సవాలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్త రామదాసు 392 జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. చిత్రకూట మండపం వేదికగా నిర్వహించే ఈ ఉత్సవాలు భద్రాద్రి దేవస్థానం, శ్రీచక్ర సిమెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 5వ తేది వరకు ఈ ఉత్సవాలు సాగనుండగా తొలిరోజున నగర సంకీర్తన, రామదాసు విగ్రహానికి అభిషేకం, నవరత్న కీర్తనల గోష్ఠిగానం నిర్వహించనున్నారు.

నిరుపయోగంగా ధ్యాన మందిరం

భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై నిర్మించిన రామదాసు ధ్యానమందిరం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 1962 జనవరి 5న అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ మందిరానికి శంకుస్థాపన చేయగా 1971 నవంబరు 5న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆనాడు భక్తరామదాసు స్మారకంగా నిర్మించిన మందిరంలో ఆయన రచించిన కీర్తనలను శిలాఫలకాలపై చెక్కి రామ భక్తులు తిలకించేందుకు అందుబాటులోకి తెచ్చారు. అయితే గతంలో ధ్యానమందిరం పూర్తిగా నిరక్ష్యానికి గురికాగా ఇటీవల కాలంలో అధికారులు పర్యవేక్షించే చర్యలు కొంతమేరకు చేపట్టినా అవి పూర్తిస్థాయిలో లేవు. భక్తరామదాసు రచించిన కీర్తనలు శిలాఫలకాలపై చెక్కగా అనంతరం వాటికి కాలక్రమంలో పట్టించుకోకపోవడం, రంగులు వేయకపోవడంతో అవి పూర్తి స్పష్టతతో కనిపించని పరిస్థితి ఉంది.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

తెలుగు సాహిత్యంలో శతకాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో దాశరధి శతకం మకుటాయమానం అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ప్రతీ విద్యార్థికి ఈ శతకం ఎంతో అవసరం. ఎందుకంటే ఒకవైపు భక్తిభావన, మరో వైపు భాషపై పట్టు సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుంది. భక్త రామదాసు సాహిత్య ప్రచారంతో విద్యార్థుల్లో తెలుగు సాహిత్య పరిమళాలు వెదజల్లే అవకాశం ఉంటుంది. ఆ దిశగా భద్రాద్రి దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టాలని సాహిత్య అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జూలూరుపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుపాడు గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఐ బాదావత్ రవి బుధవారం తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5100లను స్వాధీనం చేసుకుని 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన జూదరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో జరిగింది. మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన చెవుల ఉపేందర్(28) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు ఇటీవల మద్యానికి బానిసగా మారాడు. భార్యభర్తల మధ్య తరుచు గొడవలు జరగుతుండటంతో మంగళవారం ఇంటివద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

‘పంచాయతీ’కి రెడీ

(5వ పేజీ తరువాయి)

చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తాజా మాజీ సర్పంచ్‌లే చొరవ తీసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంక్షేమ పథకాలపై అధికారపార్టీ ఆశలు

పంచాయతీ సమరంలో విజయానికి అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలపైనే ఆశలు పెట్టుకుంది. ‘స్థానిక’ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే పథకాల అమలుకు వేగంగా చర్యలు తీసుకుంది. అయితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో కేడర్‌కు, నాయకులకు మధ్య కొంత దూరం పెరిగింది. ప్రభుత్వ నామినేటెడ్ పదవులు అందరికీ అందకపోవడం, పార్టీలో గుర్తింపు దక్కడం లేదన్న ఆవేదనతో పార్టీ క్యాడర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలకు మధ్య కొంత గ్యాప్ ఏర్పడింది. ప్రజాప్రతినిధులు తమకు సమయం కేటాయించడం లేదని క్యాడర్‌లో కొంత అసంతృప్తి నెలకొంది. పదేళ్లు ప్రతిపక్షంలో ఉండి నాటి అధికార బీఆర్ఎస్‌పై పోరాటం చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినా వర్గవిబేధాలు, మంత్రుల మధ్య ఆధిపత్య పోరు తమకు కొంత ఇబ్బంది కలిగిస్తోందని పార్టీ శ్రేణులు వాపోతున్నాయి. తమ వ్యక్తిగత సమస్యలు, గ్రామ సమస్యలను కూడా కొంతమంది ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో వర్గపోరు బహిర్గతమయ్యే అవకాశం కనిపిస్తోంది.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గంలోకి ‘నున్నా’

(5వ పేజీ తరువాయి)

తొలిసారిగా రాష్ట్ర కార్యదర్శివర్గంలోకి స్థానం లభించింది. 17ఏళ్ల వయస్సు నుంచే ఉద్యమ బాటలోకి వచ్చిన ఆయన 42 సంవత్సరాలుగా కార్యకర్తగా, అనేక విద్యార్థి, యువజన ఉద్యమాలను నిర్వహించాడు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యపాన నిషేధ, గుట్కా వ్యతిరేక ఉద్యమాలు, నిరుద్యోగ సమస్యలపై జనార్ధన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైవేటు మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలను నిలిపివేయాలని జరిగిన ఉద్యమాలలో కీలకమైన పాత్ర పోషించారు. భూపోరాటాలలో 5సార్లు జైలుకు వెళ్లారు. కాగా నున్నా నాగేశ్వరరావుతో పాటుగా జిల్లా నుంచి యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావులకు రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం లభించింది. ప్రత్యేక ఆహ్వానితులుగా బుగ్గవీటి సరళను తీసుకున్నారు.

‘సంక్షేమ’ దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ జితేష్ వీ పాటిల్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

కొత్తగూడెం/పాల్వంచ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలోని అర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సంక్షేమ పథకాల అమలు, పీఎం కూసుమ్ పథకం, వేసవిలో నీటికొరత రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్లాంటేషన్‌పై వీసీ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో చర్ల 23, దుమ్ముగూడెం23, అశ్వాపురం3, మణుగూరు7, బూర్గంపాడులో ఒకటి దరఖాస్తు ఉందని, ఆన్‌లైన్‌లో నమోదుకాని గ్రామాల దరఖాస్తులను రేపు ఉదయం లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కొత్తగా 3403 దరఖాస్తులు వచ్చాయని, ఉపాధి హామీ పథకంలో 20రోజులు పనిదినాలు పూర్తి చేసిన వారిని ఈనెల 31లోపు పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. బ్యాంక్ అకౌంట్‌లో నమోదైన 29 దరఖాస్తులను సరైన బ్యాంక్ అకౌంట్ నెంబర్లను నమోదుచేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులకు గ్రామసభలు, ప్రజాపాలనలో దరఖాస్తుచేసుకున్న అర్జిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదుచేసి అర్హులకు డిజిటల్ రేషన్‌కార్డులు మంజూరుచేయాలన్నారు. పీఎం కూసుమ్ పథకం అమలులో విద్యుత్ అధికారులు ప్రతి మండలంలో సబ్‌స్టేషన్ వివరాలను తహసీల్దార్లకు అందచేయాలన్నారు. పీఎం కూసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు నాలుగు ఎకరాల భూమిని గుర్తించి మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ప్లాంట్ స్థాపించాలన్నారు. వేసవిలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో నాటాల్సిన మొక్కలు, ప్లాంటేషన్ లక్ష్యాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీసీలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీవో చంద్రమౌళి, పీడీ హౌసింగ్ శంకర్, జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, ఎల్‌డీఎం రామిరెడ్డి, డీఈఓ వెంకటేశ్వరచారి, సెర్ప్ పీడీ నీలేష్, అడిషనల్ డీఆర్డీఓ రవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వండటానికి ముందే ఆహార పదార్థాలు తనిఖీ చేయాలి

పాల్వంచ, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ దమ్మపేట సెంటర్‌లోని ఆశ్రమ గు రుకుల వసతిగృహాన్ని బుధవారం రాత్రి కలెక్టర్ జితేష్ వీ పాటి ల్ సందర్శించారు. విద్యార్థులతో మమేకమై వా రికి అందుతున్న సదుపాయాలను గూర్చి ఆరా తీసారు. డైనింగ్‌హాల్, క్లాస్‌రూమ్స్, పరిసరాలు, కిచెన్‌షెడ్ తదితరాలను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్దంగా ఉన్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం వండటానికి ముందే ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వసతిగృహం, పాఠశాలలో విద్యార్థులకు కావలసిన ఏర్పాట్లు, వసతుల నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం బద్రు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

దుమ్ముగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. దుమ్ముగూడెంలో జరుగుతున్న నేచర్ క్యాంపును బుధవారం సందర్శించారు. ప్రకృతికి ఎటువంటి నష్టం కలగకుండా ప్రవర్తించడం ప్రతీ ఒక్కరి బాధ్యత తెలిపారు. భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించడం మన బాధ్యతన్నారు. ప్రతీ ఇంటిలో మొక్కలు నాటి పెంచే విధంగా కృషిచేయాలని కోరారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా లక్ష్మీనగరం గ్రామ పెద్దలు, యువత డీఈవోను ఘనంగా సన్మానించారు. జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, డీఎస్‌వో ఎస్.శ్రీనివాస్, జి.రాజశేఖర రావు, ఎంఈవో సమ్మయ్య, హెచ్ఎం రామారావు, ఎస్ఓ శోభారాణి, బొడ్డు నాగేశ్వరావు, హైమావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో

యాష్ ట్యాంకర్ చోరీ కేసులో ఇద్దరికి ఆరునెలల జైలు

జూలూరుపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): యాష్ ట్యాంకర్‌ను అమ్మడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్షను విధిస్తూ కొత్తగూడెం మూడోవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత బుధవారం తీర్పు ఇచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. మణుగూరు సుందరయ్య నగర్‌కు చెందిన ముల్లంగి శ్రీనివాస్‌రెడ్డి ట్రాన్స్‌ఫోర్ట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి ఆరు లారీలు ఉన్నాయి. ఏపి20 టిబి0455 నెంబర్‌గల ట్యాంకర్‌లో ఓనర్ శ్రీనివాసరెడ్డి లోడ్ చేయించి ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఒంటిగుడిసెకు చెందిన డ్రైవర్ ఈసాం వీరస్వామికి ట్యాంకన్‌ను ఇచ్చి యాష్‌ను దిగుమతి చేసేందుకు 2015 మే 25న పాల్వంచ నుంచి గుంటూరు జిల్లాలోని రెంటచింతల సమీపంలోని చిట్టిపాలెంలో గల సిమెంట్ కంపెనికి ట్యాంకర్‌ను పంపించాడు. సదరు డ్రైవర్ కంపెనీలో యాష్‌ను దిగుమతి చేసి మే 27న మణుగూరుకు వచ్చేందుకు బయలుదేరనని, ఈ క్రమంలో చిల్లకల్లు సమీపంలో ఇద్దరు ప్యాసింజర్లను ఎక్కించుకున్నానని, అదే రోజు రాత్రి 8:30 గంటల సమయంలో జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్‌రోడ్డు సమీపంలో ట్యాంకర్‌ను ఆపి ఇంటికి వెళ్లివస్తానని లోపల ఉన్న ఇద్దరితో చెప్పి వెళ్లినట్లు డ్రైవర్ ఓనర్‌కు తెలియజేశారు. తాను ఇంటికి వెళ్లి వచ్చేలోగా యాష్ ట్యాంకర్ కనిపించలేదని సమాచారం ఓనర్‌కు అందించాడు. ట్యాంకర్ కోసం వెతికినప్పటికి దొరకకపోవడంతో జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఓనర్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేయగా సీఐ మల్లయ్య స్వామిగౌడ్ దర్యాప్తు చేశారు. దర్యాప్తులో అదే ఏడాది జూన్ 10న సుజాతనగర్ మండలంలో ట్యాంకర్ దొరికింది. దీంతో ఏన్కూరు మండలం ఒంటిగుడిసెకు చెందిన ఈసాం వీరస్వామి, గంగుల నాచారం గ్రామానికి చెందిన పూనెం వెంకటేశ్వర్లు(అలియాస్ వెంకటేష్), బావ,బామ్మర్దులు ఇద్దరు కలసి ట్యాంకర్‌ను విక్రయించేందుకు ప్రయత్నించినట్టు తేలడంతో వారిద్దరిపై కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను విచారించారు. పై ఇద్దరిపై నేరం రుజువుకావటంతో సెక్షన్ 411 ప్రకారం ఆరు నెలలు సాధరణ జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ శ్రీనివాస్ మరియు నాగలక్ష్మీ నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.ప్రవీణ్, లైజాన్ ఆఫీసర్ ఎస్‌కె.అబ్దుల్ ఘని, జూలూరుపాడు కోర్టు కానిస్టేబుల్ పి.ఉపేందర్ రావు సహకరించారు.

తెరుచుకున్న నూతన గ్రంథాలయం



పుస్తకాలను తరలిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి ఇటీవల ప్రారంభించి, మూసి వేసిన గ్రంథాలయాన్ని అధికారులు తెరిచారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రారంభించారు.. మూసివేశారు' కథనానికి వారు స్పందించారు. పాత గ్రంథాలయం నుంచి సుమారు 30 వేలకు పైచిలుకు పుస్తకాలను వాహనాల్లో తరలించారు.

గుడ్లగూబ దర్శనానికి భక్తుల ఆసక్తి



ఇల్లెందులో గుడ్లగూబను చూస్తున్న భక్తులు

ఇల్లెందు, జనవరి29(ఆంధ్రజ్యోతి): మౌని అమావాస్య రోజున ఇల్లెందు పట్టణంలో గుడ్లగూబ కనిపించడంతో దర్శనం చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పట్టణంలోని కళాసీబస్తీలో శుభోదయ పాఠశాల వద్ద కింద నడుస్తున్న గుడ్లగూబ కనిపించడంతో బస్తీ ప్రజలు దర్శనం చేసుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గుడ్లగూబ లక్ష్మీదేవి వాహనం కావడం, మౌనిఅమావాస్యరోజు కావడంతో శుభసూచకంగా భావిస్తూ దర్శనం చేసుకున్నారు. అమావాస్యరోజు గుడ్లగూబ దర్శనం శుభమా,అశుభమా అంటూ యూట్యూబ్‌లో నెట్‌లో ఆసక్తిగా అన్వేషించారు. కాగా గుడ్లగూబ అరుపులు విన్నా, చూచిన ప్రజలు భయకంపితులు అయిన సందర్భాలు ఉన్నాయి.

ఐటీసీలో ఎన్నిక సందడి

- రేపు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- సారపాకలో ప్రచారం పూర్తి
- మొదలైన బేరసారాలు



బూర్గంపాడు, జనవరి29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సారపాకలోగల ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో ఎన్నికల సందడి నెలకొంది. రేపు(శుక్రవారం) జరగనున్న ఐటీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు ఐదుకార్మిక సంఘాలు బరిలో నిలిచాయి. ఇందుకు గాను ఇప్పటికే ఇంటింటి ప్రచారం, కార్యాలయాల ప్రారంభాలతో కోలాహలం నెలకొంది. కార్మికులను తమవైపు తిప్పుకునేలా యూనియన్ నాయకులు వ్యూహరచనతో పాటు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. అయితే మరో 24 గంటల్లో ఈ ఎన్నికలు జరగనుండటంతో కార్మికశాఖ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో కార్మిక సంఘాల నాయకులు ప్రచారంకు గుడ్‌బై చెప్పి కార్మికులను వ్యక్తి గతంగా కలిసే పనిలో ఉన్నారు.

ఓటర్లు 1253మంది

కర్మాగారంలో మొత్తం 16 కార్మిక సంఘాల యూనియన్లు ఉండగా ఎన్నికల బరిలో ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, బీఆర్‌టీయూ, టీఈయూ మాత్రమే నిలిచాయి. ఇందులో ప్రధానంగా ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ యూనియన్ల మధ్య ప్రధాన పోటీ ఉంటుందని కార్మికులు విశ్లేషిస్తున్నారు. కర్మాగారంలో 1253 మంది కార్మికులు ఓటర్లుగా ఉన్నారు. ఈ ఎన్నికలు కర్మాగారంలోని కార్మికులకు కనీస వేతనాన్ని చేయాల్సి ఉంది.

బేరసారాలు ప్రారంభం

ఇప్పటికే ఎన్నికల గడువు సమీపించడంతో ఇక తాయిలాలను బేరసారాల పనిలో కొందరు ఉన్నారు. యూనియన్ నాయకులు కార్మిక ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా పంపకాలకు సిద్ధమవుతున్నారు. మరికొందరికి గిఫ్టులు ఇస్తున్నారు. సాధారణ ఎన్నికలను సైతం మరిపించే రీతిలో ఐటీసీ గుర్తింపు ఎన్నికలు తీరు ఉంది. కార్మికసంఘం గుర్తింపు ఎన్నికల్లో పంపకాల కార్యక్రమం బుధవారం సాయంత్రం నుంచే ప్రారంభమైంది.

మూడో రైల్వేలైన్ ట్రయల్‌రన్ సక్సెస్

- ప్రారంభించిన సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్
- పందిళ్లపల్లి నుంచి మోటమర్రి వరకు పూర్తి



మూడో రైల్వేలైన్‌పై మోటర్ ట్రాలీలో సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి

బోనకల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బోనకల్ రైల్వే స్టేషన్ వద్ద బుధవారం మూడోరైల్వే లైన్ ట్రయల్‌రన్‌ను సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్‌జైన్ ప్రారంభించారు. ట్రయల్ రన్ ద్వారా మోటమర్రి వరకు వెళ్లారు. కాజీపేట నుంచి విజయవాడ వరకు రెండేళ్లుగా మూడో రైల్వేలైన్ పనులు చేస్తున్నారు. పందిళ్లపల్లి నుంచి బోనకల్ మండలం మోటమర్రి రైల్వే స్టేషన్ వరకు మూడో రైల్వేలైన్ పనులను పూర్తి చేశారు. రైల్వేస్టేషన్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు సిగ్నల్ వ్యవస్థను పరిశీలించారు. పార్కులో మొక్కలను నాటారు. అనంతరం అఖిలపక్ష నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, తెల్లాకుల శ్రీనివాసరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, రావుట్ల సత్యనారాయణ, బీపీ నాయక్, భూక్యా సైదా నాయక్, తాళ్లూరి సురేష్, జంపాల రవి పలు సమస్యలపై వినితప్రం ఇచ్చారు. బోనకల్‌లో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, ఇంటర్‌సిటీ, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌రైళ్లను హాల్టింగ్ ఉండేలా చూడాలని సీఆర్‌సీ, డీఆర్‌ఎంలకు వినతిపత్రాన్ని అందజేశారు. గోవిందాపురం(ఎ) వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని వారు విన్నవించారు. స్పందించిన అధికారులు తొందరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీప్యూటీ సీఆర్ఎస్ శ్రీనివాస్, సీఈఈ సురజన్‌రెడ్డి, సీఎస్‌టీఈ గుడిశార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తుపల్లిలో రాజశ్యామల యాగం

హాజరుకానున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి,జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో వేంచేసియున్న లక్ష్మీగణపతి దేవాలయంలో గురువారం నుంచి రాజశ్యామల సహిత దశమహావిద్య యాగం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తేరాల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ చంద్రమౌళీశ్వరేంద్రసరస్వతి స్వామి, కంచికామకోటి పీఠాధితులు, శృంగేరి జగద్గురువుల దివ్య ఆశీస్సులతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9రోజుల పాటు జరిగే ఈ యాగానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవ్వనున్నట్లు చెప్పారు.

అపోహలు అవసరం లేదు

- త్వరలోనే డెస్క్ జర్నలిస్టులకు సభ్యత్వాలు ఇస్తాం
- స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సైదులు
- స్తంభాద్రి డెస్క్ జర్నలిస్టు ఫోరం అడహక్ కమిటీ ఎన్నిక



ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి29(ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వాల విషయంలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులు అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, త్వరలోనే వారికి కూడా సభ్యత్వాలు ఇస్తామని సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులకు సొసైటీ సభ్యత్వాల మంజూరు విషయంలో కొంతకాలంగా జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో స్తంభాద్రి డెస్క్ జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు బుధవారం ఖమ్మం మంచి కంటి భవన్లో సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు,టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లును కలిసి తమ ఆవేదనను వినిపించారు. ఈసందర్భంగా కనకం సైదులు మాట్లాడుతూ తాము ఎప్పుడు డెస్క్ జర్నలిస్టులకు సభ్యత్వాలు ఇవ్వడం లేదని చెప్పలేదని, అదంతా ప్రచారం మాత్రమేనని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో దరఖాస్తులను పరిశీలించి సభ్యత్వాలు అందజేస్తామని స్పష్టం చేశారు.అంతకుముందు న్యూఇరా పాఠశాలలో జరిగిన సమావేశంలో అడహాక్ కమిటీ కమిటీ కన్వీనర్‌గా కంకూరి వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోకన్వీనర్లుగా పి.శ్రీనివాసరావు, వి.ఏకాంబరావు, కె.ప్రసాదరావు, జి.నారాయణరావు, బి.రాంబాబు వి. అంజయ్య, కెవి.రమణ, బివంశీ, పి.రమేష్, కె.అచ్చిరెడ్డి, పి.ప్రసాద్‌రావును ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా సింకేసి శంకర్రావు, కే.రాజేష్, కేశవకుమార్, పి.వెంకటప్పయ్య, ఎస్. కరుణాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు

ఎకో పార్కును మంజూరు చేయండి

పీసీసీఎఫ్‌కు ఎమ్మెల్యే జారే వినతి



అశ్వారావుపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ఎకోపార్కును మంజూరి చేసి, నిర్మాణానికి నిధులు మంజూరి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కన్జర్వర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) ఎం. డోబ్రీయల్‌ను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలసి వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయన హైదరాబాదులోని అరణ్యభవన్‌లో సీసీఎఫ్‌ను కలిశారు. ఇటీవలే అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పడింది. మునిసిపాలిటీ పరిధిలో ఏకో పార్కును మంజూరి చేసి, మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. త్వరలోనే ఏకో పార్కు నిర్మాణాలకు నిధులు మంజూరి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సెక్రటేరియట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం దరఖాస్తులను అధికారులకు అందజేశారు.

చోరీ నిందితుడి అరెస్టు



దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని చూపుతున్న టూ టౌన్ పోలీసులు

ఖమ్మంక్రైం, జనవరి29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓఇంటిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. నగరంలోని మామిళ్లగూడేనికి చెందిన గండ్లూరి ఉమామహేశ్వరి ఈనెల3న ఇంటికి తాళం వేసి హైదరాబాదు వెళ్లారు. ఈక్రమంలో ఓ దొంగ ఇంటిలోని బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అయితే మంగళవారం టుటౌన్ పోలీసులు నూతన బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా నగరంలోని టీఎన్‌జీవోస్ కాలనీకి చెందిన పబ్బరాజు రాజేష్ అనుమానస్పదంగా కనిపించాడు.అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఉమామహేశ్వరి ఇంటిలో తాళంపగులగొట్టి 35గ్రామాలు బంగారు ఆభరణాలు, 200గ్రాముల వెండి వస్తువులు దొంగిలించినట్టు ఒప్పుకున్నాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మణుగూరుటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన సగనపల్లి మధు (38) ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధు నిరుద్యోగి ఇటీవల తనకున్న ఓ పాప చనిపోయింది. తీవ్ర మనస్థాపానికి గురైన మధు గత కొంత కాలంగా వేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సమీప బంధువులు మృతి చెందడంతో బార్య తేజస్వని ఇల్లెందు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల వరకు తలుపులు తెరవక పోవడంతో చుట్టుపక్కల వారు గమనించగా మధు విగత జీవిగా కన్పించాడు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టమ్ నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దుమ్ముగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని మనస్థాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బి కొత్తగూడెంకు చెందిన కాటిబోయిన జంపన్న(22) చదువు పూర్తిచేసి ఇంటివద్ద ఉంటున్నాడు. ఈ నెల 28న పనికి వెళ్లమని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన జంపన్న ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. వైద్యచికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పోటు గణేష్ కేసు నమోదు చేశారు.

ఆరుగురు మహిళలపై బైండోవర్ కేసులు

జూలూరుపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో నాటుసారా విక్రయిస్తున్న ఆరుగురు మహిళలపై బైండోవర్ కేసులను నమోదు చేసి బుధవారం జూలూరుపాడులో తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట హాజరు పరిచినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ తెలిపారు. మండలంలోని సాయిరాంతండాకు చెందిన హలావత్ పద్మ, పడమటనర్సాపురం, కొమ్ముగూడెం, గుండెపుడిలకు చెందిన గుగులోత్ అనుసూర్య, భూక్యా విజయ, భూక్యా లక్ష్మీ, మచినేనిపేటతండా, అన్నారుపాడు గ్రామాల్లోని లకావత్ జమున, భూక్యా కమిలిలు నాటు సారా విక్రయిస్తూ పట్టుబడినట్టు తెలిపారు. మరోసారి సారా విక్రయాలు జరపమని ఒకవేళ పట్టుబడితే రూ. 2లక్షల జరిమాన లేదా జైలు శిక్షనైన అంగీకరిస్తామని వారు తెలుపుతూ తహసీల్దార్‌కు రూ. 2లక్షల బాండ్లను సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టుబుల్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



మణుగూరు టౌన్ , జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని సురక్షా బస్టాండ్‌లో రూ.30 వేల గంజాయిని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం.. నార్కోటిక్ రీనాతో సురక్షా బస్టాండ్ ఏరియాలో తనిఖీలు నిర్వహిస్తుండగా బస్టాండ్‌లో ఉన్న ఓ యువకుడి వద్దకు వెళ్లి జాగిలం లాగింది. పోలీసులు అతన్ని తనిఖీ చేయగా అతని బ్యాగ్‌లో 1.6 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకుడు భూపాళపల్లి జిల్లా తాడ్వాయి మండలం కాటారం గ్రామానికి చెందిన శశికృష్ణగా గుర్తించారు. ప్రస్తుతం ఇతను హైద్రాబాద్‌లో నివసిస్తూ ఈ అక్రమ వ్యాపారాలు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తరగతి గదిలో విద్యార్థిని తలకు గాయం

చికిత్స పొందుతూ బాలిక మృతి



రఘునాథపాలెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో తోటి స్నేహితులతో అడుకుంటున్న విద్యార్థి తలకు గాయం కావటంతో చికిత్స పొందుతూ కన్నుమూసిన సంఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. అయితే మృతురాలు మరణానికి తలకు తగిలిన గాయమే కారణం అంటూ బంధువులు పోలీసులుకు ఫిర్యాదు చేయగా అటువంటిది లేదని పోలీసులు ఫిర్యాదును మార్చి రాయటంతో జిల్లా ఆసుపత్రిలోని శవ పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు, మృతురాలి బంధువులకు వాగ్వాదం చోటు చేసుకొంది. రఘునాథపాలెం మండలం రేగులచెలకకు చెందిన పొట్ట నాగేశ్వరరావు, మరియమ్మ దంపతులకు ఇద్దరు అడ పిల్లలు జన్మించారు. కూలీ పనులే జీవనాధారం కావటంతో 13 ఏళ్ల క్రితం చెట్టును నరుకుతూ పొట్ట నాగేశ్వరరావు ప్రమాదంలో కన్నుమూశారు. దీంతో కుటుంబ భారం మరియమ్మపై పడింది. రోజు వారి కూలీ పనులు చేస్తూ మరియమ్మ ఇద్దరు పిల్లల్ని చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరియమ్మ చిన్న కుమార్తె పొట్ట శ్రావణి(14) కోయచెలక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యాభ్యాసం చేస్తోంది. కాగా ఈనెల 25న పాఠశాల తరగతి గదిలో బల్లపై మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆటలాడుకుంటూ ఉండగా శ్రావణి కిందపడటంతో తల వెనుకబాగంలో దెబ్బ తగిలి బొప్పి కట్టింది. ఇంటికి వచ్చిన మరుసటి రోజు వాంతులు, ఫిట్స్ రావటంతో తల్లీ, తాతయ్యలు కలిసి శ్రావణిని జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రావణి కన్నుమూసింది. దీంతో శ్రావణి తాతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు శ్రావణి తలకు గాయమైనట్లు కాకుండా జ్వరంతో గుండేపోటు వచ్చిందని ఫిర్యాదును మార్చి రాశారని మృతురాలి తాతయ్య కొల్లు వెంకన్న 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పొలం వద్ద ఆయిల్ ఇంజన్ చోరీ

తల్లాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పొలానికి నీళ్ల పెట్టేందుకు తల్లాడలో వ్యవసాయ బావి వద్ద ఏర్పాటుచేసిన ఆయిల్ ఇంజన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధిత రైతు గరిడేపల్లి బుచ్చయ్య తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. బావి వద్ద రెండు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేయగా వాటిలోని ఒక ఆయిల్ ఇంజన్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని, ఆయిల్ ఇంజన్ విలువ రూ.15వేలు ఉంటుందని తెలిపారు.

పోలీసులపై ఆరోపణలు తగవు

ముత్తారం యువకుడి ఆత్మహత్య కేసు దర్యాప్తు కొనసాగుతోంది: సీఐ మురళి

ముదిగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై ఆరోపణలు చేయడం తగదని, ముత్తారం యువకుడు కేశవ్ ఆత్మహత్య కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ మురళి తెలిపారు. గత ఏడాది డిసెంబరు 25వతేదీ రాత్రి ముత్తారం గ్రామంలో గోళ్లమూడి కేశవ్(21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయినట్లు తమకు సమాచారం రావడంతో సంఘటనాస్థలానికి పోలీసులు వెళ్లేసరికి వారి బంధువులు మృతదేహాన్ని కిందకు దించటం జరిగిందని తెలిపారు. కేశవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటం జరిగిందని, మృతుడు కేశవ్ అక్క స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు. ఫిర్యాదులో అను మా నితులుగా ఉన్న బాలికతోపాటు మరో ఇద్దరిని విచారించటం జరిగిందని సీఐ చెప్పారు. మృతుడి సెల్‌ఫోన్‌తోపాటు అనుమానితుల ఫోన్లు సీజ్‌చేసి సైబర్ ల్యాబ్‌కు పంపి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వా రి ఫోన్లను వారికి అప్పగించటం జరిగిందని తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టులో కేశవ్ ఉరివేసుకొని మృతిచెందాడు తప్ప మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని రిపోర్టులో తేలినట్లు సీఐ తెలిపారు. బుధవారం ఖమ్మంలో మృతుడు కేశవ్ అక్క, తల్లితోపాటు మరికొందరు ఖమ్మంలో ప్రెస్‌మీట్ పెట్టి తమ తమ్ముడిని చంపి ఉరివేశారని, ఈ మృతిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తమకు న్యాయం చేయలేదంటూ అసత్య ప్రచారంతోపాటు ఆరోపణలు చేయటం తగదని సీఐ తెలిపారు.

పెళ్లి చేసుకుని మొహం చాటేశాడని..

భర్త ఇంటి ఎదుట ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

బోనకల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకొని మొహం చాటేశాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో భర్త ఇంటి ఎదుట భార్య తన కుటుంబీకులతో కలిసి దీక్షకు దిగింది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మడిపల్లి గోపి, కలకోటకు చెందిన చవల పూజితది దగ్గర గ్రామాలు కావడంతో పాటు బంధువుల ఇళ్లకు వచ్చే క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. గోపి తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు. దీంతో కొందరు పెద్దలు వీరి మధ్య సయోధ్యను కుదుర్చుకునేందుకు ప్రయత్నించారు. చివరకు గోపి ఆమెను గత ఏడాది ఆగస్టు నెలలో ఖమ్మంలోని దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నందున తాను అక్కడకు వెళ్తున్నానని, కొద్దిరోజుల తరువాత తీసుకెళ్తానని భార్యకు చెప్పాడు. పలుసార్లు అతని ఇంటి ముందు దీక్షకు కూర్చోవడం, పలుసార్లు పెద్దలు మాట్లాడి సర్ది చెప్పడం జరిగింది. ఎంతకూ కాపురానికి తీసుకెళ్లక పోవడంతో కుటుంబీకులతో కలిసి భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది. దీక్ష రాత్రి కూడ కొనసాగుతోంది.



పద్మ అవార్డుపై రాద్ధాంతం తగదు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ప్రజాయుద్ధనౌకగాపేరు గాంచిన గద్దర్‌కు పద్మ అవార్డు విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ రాద్ధాంతం చేయడం తగదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రునాయక్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటీవల కొందరికి అవార్డులు ప్రకటించిన సందర్భంగా వస్తున్న విమర్శలకు సైతం బండి సంజయ్ సమాధానాలు చెబితే బాగుంటుందని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో గద్దర్ పాత్రను, ప్రజలను చైతన్య పరిచే విషయంలో ఆయన అంకితభావాన్ని చులనకనగా చూడొద్దన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	34
బెండకాయ	44
బెండకాయ	38
పొట్లకాయ	48
దోసకాయ	34-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	20
దొండ	44-50
సొరకాయ	18
క్యారెట్	28
క్యాప్సికం	38
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

రెవెన్యూ మేళాకు 86 దరఖాస్తులు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ మేళాలో మొత్తం 86 దరఖాస్తులు అందాయని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫి ఉల్లా, రెవెన్యూ అధికారి జీ శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం నుంచి తరుచూ ప్రజావాణిలో అధికంగా ఫిర్యాదులు రావటంతో ప్రత్యేక రెవెన్యూ మేళాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఏర్పాటు చేశారు. ఇంటి నెంబర్ల మార్పు, ఒకే ఇంటికి రెండు నెంబర్ల కేటాయింపు, చిరునామాలు మార్పు, మంచినీటి కుళాయిలు లేకుండానే బిల్లులు మంజూరుపై అత్యధిక ఫిర్యాదులు అందాయి.

నేడు అల్లీపురంలో రెవెన్యూ మేళా

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో గురువారం ఖమ్మం 15వ డివిజన్ పరిదిలోని అల్లీపురంలో నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక రెవెన్యూ మేళా గ్రామసభను ఏర్పాటు చేయనున్నారు. ఇంటి నెంబర్ల సమస్యలు, విద్యుత్ మీటర్లు, ఇంటి ట్యాక్స్, తాగునీటి కుళాయిలు వంటి శాశ్విత సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించనున్నారు.



వినతులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

కేఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- పారిశుధ్య సూపర్‌వైజర్‌కు షోకాజ్
- శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ సస్పెన్షన్

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సాయంత్రం 4గంటల నుంచి6గంటల వరకు 21,41 డివిజన్లు అకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల రికార్డులను తనిఖీలు చేశారు. స్థానికులతో మాట్లాడారు. దీంతో పారిశుధ్య వ్యవస్థలో లోపాలు బహిర్గతమైనాయి. కాల్వలు శుభ్రం చేయటం లేదని, రోజుకు ముగ్గురు కార్మికులు మాత్రమే విధులకు వస్తున్నారని, మూడురోజులకు ఒకసారి పారిశుధ్య ఆటోలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ అభిషేక్ కేఎంసీ పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను సస్పెన్షన్ వేటు వేశారు. పారిశుధ్య కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు.



మురుగు కాల్వ నిర్వహణపై ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	దాకూ మహరాజ్
సాయిరాం:	పుష్ప 2
కేపీఎస్:	హాంకాంగ్ వారియర్స్
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

నో పార్కింగ్!



ఎన్టీఆర్ సర్కిల్‌లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు

నగరంలోని రహదారుల వెంట ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్ చెక్‌పోస్టు పక్కన నో పార్కింగ్ స్థలంలో ప్రజలు ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. ఖమ్మంవన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డుపైనా పలువురు ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. దీనివల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-ఖమ్మం



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదురుగా నిలిపిన ద్విచక్రవాహనాలు

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం,జనవరి29(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ భద్రత నియమాలు పాటిస్తే రోడ్డుప్రమాదాలు నివారించవచ్చని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో రోడ్డుభద్రతా వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యంతాగి వాహనాలు నడపవద్దన్నారు. ఎవరికైనా యాక్సిడెంట్ వెంటనే అక్కడున్న వారు ఆసుపత్రికి పంపి చికిత్స అందించేలా చేయాలన్నారు. తర్వాత పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వారం రోజులపాటు అవగాహన కల్పించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ఏసీపీ అందించారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్ బాబు, ఆర్ఐ సాంబశివరావు,ఎస్ఐ రవి, కమర్తపు భానుచందర్, పద్మావతి, పాల్గొన్నారు.

రవాణాశాఖ అవగాహన ప్రదర్శనలు

ఖమ్మంసంక్షేమవిభాగం: వాహనాలను నడిపే వారు ఖచ్చితంగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా ఖమ్మంరవాణాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బైపాస్ రోడ్డులో ప్రదర్శలను చేశారు. డ్రైవింగ్ చేసే వారు సీటు బెల్ట్ దరించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. రోడ్డుపైకి వచ్చి ప్రయాణాలు చేసే ప్రతీవాహనానికి బీమా తీసుకోవాలని సూచించారు. ఏఎంవీఐలు సుమలత, గోపి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తిరుమలాయపాలెం: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా చూడాలని తిరుమలాయపాలెం ఎస్ఐజగదీష్ తెలిపారు. రోడ్డు భద్రతావారోత్సవాలలో భాగంగా మండలంలోనిపిండిప్రోలులో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రసాద్, ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఏసీపీ

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్

ఖమ్మం క్రైం,జనవరి29(ఆంధ్రజ్యోతి):నగరంలో పేకాట ఆడుతున్న నలుగురిని బుధవారం రాత్రి ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలోని రమణగుట్ట సమీపంలోని సాగర్ కాలవ వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీంతో నలుగురు పట్టుబడగా మరో ఇద్దరు పారిపోయారు. వారి నుంచి రూ.6380 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

నా తమ్ముడి మృతిపై విచారణ జరపాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న మృతి చెందిన నా తమ్ముడు గొల్లమూడి కేశవ మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేయించి న్యాయం చేయాలని మృతుడి సోదరి గొల్లమూడి స్వప్న డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ముదిగొండ మండలం ముత్తారం గ్రామానికి చెందిన కేశవ ప్రవేటు ఉద్యోగం చేస్తున్నాడని, గ్రామానికి చెందిన కొందరు నా తమ్ముడిపై కక్ష పెంచుకోని నా తమ్ముడిని హత్య చేశారని ఆరోపించారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినా మాకు న్యాయం జరగలేదని అన్నారు. మృతిపై జిల్లాఅధికారాలు విచారణ జరపాలన్నారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు మరియమ్మ,భారతమ్మ, నాగయ్య, కుమారి, భద్రమ్మ, సునీత, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించుకోవాలి

- డీపీవో ఆశాలత

తిరుమలాయపాలెం, జనవరి29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచిచారు.గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. శ్మనశాటిక, నర్సరీ, డ్రెయినేజీలు పరిశీలించారు.పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి టి.రాము, హెచ్ఎంజ్యోతి, పాల్గొన్నారు.



సంప్రదాయాలు కాపాడుకోవాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర జీసీడీవో శిరీష
- కూసుమంచిలో గిరిజన విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనం

కూసుమంచి, జనవరి29(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంస్కృతి సంప్రదాయలు అద్భుతమని, ఈ సంస్కృతి సంప్రదాయలు భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఉందని సమగ్రశిక్ష రాష్ట్ర జీసీడీవో డాక్టర్ శిరీష తెలిపారు. బుధవారం కూసుమంచి ఉన్నత పాఠశాలలో గిరిజనవిద్యార్థుల సంస్కృతి సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరయ్యరు. విద్యార్థులు గీసిన చిత్రాలు, వంటకాలను, తీజ్‌వేడులకను ప్రారంభించి తిలకించారు. సంప్రదాయం ప్రకారం ప్రత్యేక బుట్టల్లో గోధుమలను నాటి పెంచిన తీజ్ బుట్టలను ఎత్తుకుని విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సేవాలాల్ వేషాధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి.చదువుల్లోనూ రాణించాలని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, జిల్లాజీసీడీవో తులసి, ఏఎంవో రవికుమార్, ఎంఈవో వీరాస్వామి,నేలపట్లహెచ్ఎం రామాచారి పాల్గొన్నారు.



కూసుమంచిలో తీజ్ బుట్టలతో విద్యార్థులు

1నుంచి భక్తరామదాసు జయంత్యుత్సవాలు

నేలకొండపల్లి, జనవరి29(ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి మూడురోజుల పాటు నేలకొండపల్లి శ్రీభక్తరామదాసు ధ్యానమందిరంలో భక్త రామదాసు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. వీటిని విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు పిలుపునిచ్చారు. భక్తరామదాసు ధ్యాన మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జయంత్యుత్సవాల బ్రోచర్‌ను సీతారాములు ఆవిష్కరించారు. అనంతరం సీతరాములు మాట్లాడుతూ రామదాసు జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించటానికి విద్వత్ కళాపీఠం కృషి చేస్తున్నదన్నారు. ఈసారి జయంత్యుత్సవాలను నూతనంగా నిర్మించిన ఆడిటోరియంలో జరుపుకోవటం అదృష్టమన్నారు. భక్త రామదాసు జన్మస్థలం నేలకొండపల్లి గావటం, మనం నేలకొండపల్లి వాసులం కావటం మన పూర్వ జన్మ సుకృతమన్నారు. జయంత్యుత్సవాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీతారాములు కోరారు. కార్యక్రమంలో సాదు రాధాకృష్ణమూర్తి, మన్నె కోటేశ్వరరావు, నంచర్ల దేవీప్రసాద్, వాసం లక్ష్మయ్య, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, తెల్లగొర్ల లింగస్వామి, జక్కేపల్లి జ్వాలయ్య, గెల్లా వెంకటరమణగుప్తా, రాయపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జయంత్యుత్సవాల బ్రోచర్‌ను ధ్యానమందిరంలోని శ్రీరాముల వారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేసారు. అర్చకుడు సౌమిత్రి రమేష్ పూజలు నిర్వహించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలి

కూసుమంచి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను సెమీరెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్రకార్యదర్శి, ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాలరెడ్డి డిమాండ్ చేశారు. కూసుమంచిలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో గుండెబోయిన నాగేశ్వరరావు, కాట్ల జగన్నాధం పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ చొరవతో అర్హత కలిగిన వారందరికీ ప్రతీనెల సంక్షేమ పథకాలు పంపిణీ జరుగుతుందని 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం పాండురంగాపురంలోని 3వడివిజన్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు శీలం శ్రీనివాసరావు, చల్లా రాంబాబు, హెచ్చు వెంకటేశ్వర్లు, మేడబోయిన మల్లేశం, డీ గోపి, డేగల ఉపేందర్, హెచ్చు విలాస్‌రావు, ఎస్‌కే ఫరీదు, చిర్రా రాంబాబు, బోయిన సురేశ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేస్తున్న తనను గెలిపించాలని టీపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో గుండెబోయిన నాగేశ్వరరావు, కాట్ల జగన్నాదం, సుబాని పాల్గొన్నారు.

రేపు మాలల సమ్మేళనం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఈనెల 31న ఖమ్మం నగరంలో జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈసమావేశంలో లింగాల రవికుమార్, గుమ్మడి కనకరాజు, కొట్టె సుధాకర్, పేరం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌కు వ్యక్తి అప్పగింత

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేని అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు మెప్మా అధికారులకు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. మతిస్థిమితం సరిగా లేనికారణంగా ఖమ్మంలోని వీధుల వెంట తిరుగుతుండగా గురువారం స్థానికులు డయల్‌కు 100కు ఫోన్‌చేశారు. పోలీసులు ఆ వ్యక్తిని కేఎంసీలోని మెప్మా మహాత్మాగాంధీ పట్టణ సమాఖ్యకు అప్పగించారు. వారి సమాచారంతో అన్నం శ్రీనివాసరావు కేఎంసీకి చేరుకున్నారు. మెప్మా నుంచి రావాల్సిన రూ.6లక్షల నైట్‌షెల్టర్ బిల్లులు రావటం లేదని అన్నం మెప్మా అధికారులకు సమస్యను వివరించారు. దీంతో టీఎంసీ సుజాత వచ్చి నచ్చజెప్పారు. వారంలో బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వటంతో వ్యక్తిని తీసుకెళ్లారు.

ఉద్యోగులకు అండగా టీజీవో

ఖమ్మంరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీఓ అండగా ఉంటుందని టీజీఓ జిల్లా సెక్రటరీ ఎం.వేలాద్రి అన్నారు. ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంప్రసాద్‌కు బుధవారం డైరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఓ హౌజింగ్ సొసైటీ సెక్రటరీ ఎస్.రాంబాబు, ఎం.డి తాజుద్దీన్, సంపత్ కుమార్, ఏఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రాం పరిశీలన

ఖమ్మంరూరల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జలగం నగర్‌లోని ఉన్నత పాఠశాలలో 6వతరగతి విద్యార్థుల ఆంగ్ల భాష మాట్లాడే నైపుణ్యాలు పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ద్వారా సమాధానాలు రాబట్టారు. వీకెన్‌లెర్న్ ప్రోగ్రాం వీడియోలతోపాటు, విద్యార్థులు ఆంగ్లంలో సంభాషించే విధంగా సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.శ్యాంసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి కూరాకుల పరామర్శ

కూసుమంచి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగొమ్మ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన బుర్రా మహేష్ కుటుంబాన్ని మాజీ డీసీసీబీ చైర్మన్, యాదవ మహాసభ జిల్లాఅధ్యక్షులు కూరాకుల నాగభూషణం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా మహేష్ చనిపోతూ.. తన అవయవ దానంతో పలువురికి వెలుగులు నింపాడని తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మంనగర అధ్యక్షులు నాగరాజు, యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి, మాజీ వైరామార్కెట్ చైర్మన్ రోషయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బారి మల్సూరు, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్నిక

మధిరటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మధిర ఆత్మకమిటీ చైర్మన్‌గా బోనకల్లు మండలం రాయన్నపేటకు చెందిన కర్నాటి రామకోటేశ్వరరావు బుధవారం ఎన్నికయ్యారు. మధిరలోని రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో మధిర ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అదనపు సహాయ సంచాలకులు మిట్టపల్లి సతీష్ ప్రభుత్వం నియమించిన 29 సభ్యుల చేత సంతకాలు సేకరించి చైర్మన్ ఎన్నికను చేపట్టగా రామకోటేశ్వరరావు ఒక్కరే నామినేషన్ వేయగా ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. అలాగే జిల్లా ఫార్మర్స్ అడ్వైసరీ కమిటీ సభ్యులుగా కొప్పుల గోవిందరావు, నల్లమోతు సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత

ఆందోళనలో వైరా మండల రైతులు

వైరా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను బుధవారం నుంచే అధికారులు నిలిపివేశారు. దాంతో ఇంకా రోడ్లు, కల్లాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిగిలి ఉన్న ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతి ఉంటేనే తాము వాటిని కొనుగోలు చేస్తామని డీసీఎంఎస్ అధికారులు, సిబ్బంది ఖరాకండీగా చెప్పడంతో ధాన్యం మిగిలి ఉన్న రైతులు హైరానా చెందుతున్నారు. ముఖ్యంగా వైరా మండలంలోని కనకగిరి సిరిపురం, విప్పలమడకలో అనేకమంది రైతులకు చెందిన వేలాది బస్తాల ధాన్యం రోడ్లు, కల్లాల్లో ఆరబోశారు. పది రోజుల కిందటే ధాన్యాన్ని మిషన్లతో కోయించి రోడ్లు, కల్లాలపై ఆరబోసినప్పటికీ తేమశాతం ఎక్కువగా ఉందనే సాకుతో వాటిని కొనుగోలు చేయలేదు. తీరా బుధవారం ఇక తాము ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రసక్తే లేదని, ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే ముందుకు వెళ్తామని డీసీఎంఎస్ అధికారులు, సిబ్బంది స్పష్టం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈనెల 31వతేదీలోగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేసి కేంద్రాలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఓపీఎంఎస్ ప్రక్రియను 31వతేదీలోగా పూర్తి చేయాల్సి ఉండటంతో ఆపనులు చేసేందుకుగానూ రెండు రోజుల ముందే ధాన్యం కొనుగోళ్ల నిలిపివేశారు. సిరిపురం, విప్పలమడకల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్రాల్లో ఇప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యాన్ని కూడా డీసీఎంఎస్సే కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ తేమశాతం రాలేదనే కారణంతో పదిరోజుల నుంచి రైతులను పడిగాపులు కాయించారు. నాలుగైదురోజుల నుంచి ఎడతెరపి లేకుండా ఉదయం 11గంటల వరకు పొగమంచు ఉండటం ఆతర్వాత మాత్రమే ధాన్యాన్ని ఆరదీయాల్సి రావడం వంటి వాతావరణ సంబంధమైన సమస్యలు కూడా రైతుల పాలిట శాపంగా మారాయి. బోనకల్ మండలంలో కూడా ఇంకా వందలాదిమంది రైతులకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. అక్కడ కూడా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అందువలన రోడ్లు, కల్లాల్లో పదిరోజుల నుంచి ఆరబోసి ఉంచిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



రహదారిపై ఆరబోసిన ధాన్యం

అనుమతి తీసుకొని కొనుగోలు చేస్తాం
సందీప్, డీసీఎంఎస్ జనరల్ మేనేజర్

ఇంకా మిగిలి ఉన్న ధాన్యం రైతుల ఆందోళన గురించి ఖమ్మంజిల్లా డీసీఎంఎస్ జనరల్ మేనేజర్ సందీప్‌ను వివరణ కోరగా ఆయన స్పందించారు. మండలంలో ఇంకా సిరిపురం, విప్పలమడక గ్రామాల్లో అనేక మంది రైతులకు చెందిన ధాన్యం కల్లాలు, రోడ్లపై ఆరబోసి ఉంచిన విషయం వాస్తవమేనన్నారు. ఓపీఎంఎస్ ప్రక్రియను 31వతేదీలోగా పూర్తిచేయాల్సి ఉందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని అందుకోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు మరో పదిరోజులు వ్యవధి కావాలని కోరామని తెలిపారు.

'విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి'



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

వైరా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహన చోదకుడు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వైరా ఎంవీఐ వరప్రసాద్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వైరాలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎంవీఐ రవిచంద్ర, పోలీస్ ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్‌తో కలిసి తామంతా విధిగా ట్రాఫిక్ రూల్స్‌కు కట్టుబడి ఉంటామని వాహన యజమానులు, డ్రైవర్లతో ఎంవీఐ ప్రతిజ్ఞ చేయించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, కార్లు ఇతర వాహన చోదకులు సీటుబెల్టు పెట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇన్సూరెన్స్ ఇతర ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం ఇతర మత్తుపదార్థాలు తీసుకొని వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. వైరా ట్యాక్సీ స్టాండ్ యూనియన్ సభ్యులు రేచర్ల రామారావు, ఉపేందర్, పాషా, శ్రీనివాసరావు, విశ్వనాథం, ఉద్దండు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

వైరా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబుకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు బుధవారం ఒక వినతిపత్రం అందజేశారు. రాజకీయ ప్రమేయం లేకుండా నిజమైన లబ్ధిదారులకు వీటిని అందించాలని వినతిపత్రంలో కోరారు. మాస్‌లైన్ మండల కార్యదర్శి యలదండి బాబు, నాయకులు తడికమళ్ల సీతరాములు, నున్నావత్ శ్రీను, గొడ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి

కల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలిని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరులో ఆ పార్టీ మండల కార్యదర్శి కె పుల్లారావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి బి లాజరు, డివిజన్ నాయకుడు మాల్యాద్రి మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మహిళలకు మహాలక్ష్మి పథకం గ్యాస్ సబ్సిడి, రైతు భరోసా, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి జీవనభృతి రూ.12 వేలు, ఉపాధి హామీ పనికి కార్డుతో లింకు లేకుండ కార్మికులందరికి జీవన భృతి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీ లను అమలు చేయాలని కోరుతూ వారు ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు మంగయ్య, పరిమళ, వసంత, వెంకటి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల వితరణ

మధిర రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి అల్లుడైన నోముల మైపాల్‌రెడ్డి, వైష్ణవి దంపతులు బుధవారం క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రూ.50వేల విలువైన క్రీడా దుస్తులను దాతలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో వై.ప్రభాకర్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పెనుబల్లి పోలీసులకు ఉద్యోగోన్నతి

పెనుబల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలువురు పోలీస్ కానిస్టేబుళ్లు పదోన్నతితో శిక్షణ కోసం హైదరాబాద్ తరలివెళ్లారు. పదోన్నతి పొందిన వారిలో తుంగా పిచ్చయ్య, చక్రధర్‌రాజు, బజ్జూరి దామోదర్, సుంకర రాంబాబు, గుగ్గిళ్ల దామోదర్ ఉన్నారు.

కార్పెంటర్లకు రుణాలు ఇవ్వాలి

సత్తుపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్పెంటర్ల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు సబ్సిడీపై వడ్డీలేని రుణాలు, పనిముట్లు ఇవ్వాలని సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. బుధవారం స్థానిక తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో సమావేశమై 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలిశాల లక్ష్మాచారి, సురేష్, హరీష్‌కుమార్, ఎస్‌కే.బాబా, అప్పాచారి, రామకృష్ణ లక్ష్మీనరసింహ, మోహనాచారి, నాగేంద్రచారి, రాము, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పైరుకు నష్టం.. పోలీసులకు ఫిర్యాదు

కల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని రఘునాథగూడెం గ్రామంలో పొట్టదశలో ఉన్న వరి పైరుపై గ్రైసిల్ కలుపు మందు వినియోగించి పంట నష్ట పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ రైతు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది మండల పరిధిలోని రఘునాథగూడెం గ్రామానికి చెందిన రావూల తిరుపతమ్మ తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్రుపట్ల రెవెన్యూ పరిధిలో రఘునాథగూడెం గ్రామ రెవిన్యూ రికార్డు ఖాతనెం 2170 ప్రకారం తనతో పాటుగా వాటాదారులైన కుక్కా సుజాత, రావూల వెంకటేశ్వరరావులకు సంబంధించి ఒక ఎకరం ఇరువై రెండు కుంటల భూమి పట్టాగా ఉంది. సదరు భూమి మాగాణి కాగా తాము యాసంగి వరి సాగు చేయగా ప్రస్తుతం పైరు పొట్ట దశలో ఉంది. తమ వరి పొలంలో కొందరు వ్యక్తులు రెండు రోజుల గ్రైసిల్ కలుపు ముందు పిచికారి చేయించారని ఫిర్యాదులో పేర్కొంది. కలుపు మందు పిచికారితో పొట్ట దశలో ఉన్న వరి పైరు ఎర్రబడి పంట నష్టం జరిగిందని తెలిపింది.

చెత్త వేసినందుకు జరిమానా

సత్తుపల్లిరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ రహదారిపై చెత్త వేసినందుకుగానూ మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు రూ.2వేలు జరిమానా విధించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానిక లలితకుమారి ఆసుపత్రి రోడ్‌లోని హైపర్ 2.0 మెగా సూపర్ మార్కెట్ ఎదుట పట్టణ పురవీధిపై నిర్లక్ష్యంగా చెత్తను పడవేశారు. వార్డు విజిట్‌లో భాగంగా పరిశీలించిన కమిషనర్ రూ.2వేల జరిమానా విధించారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయొద్దని, మునిసిపాలిటీ ట్రాక్టర్‌లో మాత్రమే తడి, పొడిచెత్తలను వేయాలని సూచించారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతమైతే శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. పట్టణాన్ని సుందరీకరిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా సహకరించినట్లయితే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు

వైరా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ, మండల, మునిసిపల్ కేంద్రమైన వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుచేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్, ఖమ్మంజిల్లా పోర్టుపోలియో అడ్మినిస్ట్రేటీవ్ జడ్జి అయిన సాయిసుధకు ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఒక వినతిపత్రం అందజేశారు. ఖమ్మంజిల్లా కోర్టు రెండోవ సీనియర్ సివిల్‌కోర్టు ప్రారంభోత్సవానికి మంగళవారం వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ సాయిసుధకు ఈ వినతిపత్రం సమర్పించారు. వైరా, కొణిజర్ల, తల్లాడ, ఏన్కూరు, చింతకాని మండలాల ప్రజలు ప్రస్తుతం కోర్టు కేసుల నిమిత్తం మధిర, సత్తుపల్లి, ఖమ్మం వెళ్లాల్సి వస్తుందని, బలహీన వర్గాలు, సీనియర్ సిటిజన్లు న్యాయం పొందడంలో ఆర్థిక, రవాణాపరంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అందువలన వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుచేయాలని ఆవినతిపత్రంలో కోరారు. వైరా నుంచి 35కిలోమీటర్ల దూరంలో ఉన్న మధిర కోర్టుకు, 55కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్తుపల్లి కోర్టులకు వెళ్లాల్సి వస్తుందని అందువలన న్యాయం కోసం వెళ్లే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువలన వైరాలో మెజిస్ట్రేట్ కోర్టు సముదాయాన్ని ఏర్పాటుచేయాలని ఆ వినతిలో కోరారు. ఖమ్మం బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, వైరా ప్రాంతానికి చెందిన న్యాయవాదులు సంపసాల వరదరాజు, నరేష్‌బాబు, లగడపాటి కృష్ణమోహన్, నె ప్రహా, సుబ్రహ్మణ్యం, యిజ్జగాని శ్రీనివాసరావు, పణిహారం లిఖిత పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కళా బృందం ప్రదర్శనలు



ప్రదర్శన నిర్వహిస్తున్న కళాజాతా బృందం

పెనుబల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగగూడెం గ్రామంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరెంపుల సతీష్ కళాజాత బృందం బుధవారం ప్రదర్శనలు ఇచ్చారు. లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో లింగగూడెంలో ఆరోగ్య అంశాలపై సతీష్ కళాబృందం ఆటపాట, పల్లెసుద్దులు, కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాతృమరణాలు, పౌష్టికాహారం, టీబీ, క్యాన్సర్, సీజనల్ వ్యాధులు, హెచ్ఐవీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఏఎన్ఎంలు శాంతమ్మ, కల్పన, ఆశకార్యకర్తలు రమణ,స్వాతి, సామ్రాజ్యం, రాజేశ్వరి, కళాకారులు రాజేశ్వర్, నర్సింహారావు, చంద్రరావు, సుబ్బు, గురవయ్య, రాము పాల్గొన్నారు.

పెనుబల్లి తహసీల్దార్‌కు అభినందనలు



తహసీల్దార్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ గంటా ప్రతాప్ ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు ఆయనను బుధవారం సన్మానించారు. వీఎంబంజర్, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌ను శాలువాతో సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విట్టపల్లి కిరణ్‌కుమార్, మేకతొట్టి కాంతయ్య, గోగినేని రమేష్, వంగా నిరంజన్, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఆర్డీవో

ముదిగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో జి.నర్సింహారావు ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. కల్యాణలక్ష్మీ, రేషన్‌కార్డులకు సంబంధించి మీసేవ దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ముదిగొండ మండల వ్యాప్తంగా 87మంది లబిదారులకు ఆర్డీవో నర్సింహారావు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, సిబ్బంది రవీందర్, జానీ, రమాదేవి, మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఆర్డీవో

విద్యార్థి కుటుంబానికి సాయం

గతనెల మధిర మండలం కృష్ణాపురం గ్రామంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతూ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి మాడుగుల సాయివర్ధన్ తల్లిదండ్రులు రాంబాబు, సునీతలకు బుధవారం ముదిగొండ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో జి.నర్సింహారావు రూ.ఐదులక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు, గుర్రం వెంకయ్య, మందరపు ఉపేంద్రరావు పాల్గొన్నారు.

మురుగునీరు, వీధిలైట్ల సమస్యకు మోక్షం

వైరా, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో నెలలతరబడి వేధిస్తున్న రెండు సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఏడెనిమిదినెలల నుంచి దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలకు మురుగునీటి నుంచి ఉపశమనం కల్పించారు. అలాగే రెండునెలల నుంచి కటిక చీకట్లో ఉన్న మధిర-జగ్గయ్యపేట రోడ్డులో వీధిలైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ రెండు పనులు కూడా ఈనెల 26న మునిసిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన తర్వాత మాత్రమే పరిష్కార దిశగా చర్యలు ఉండటం విశేషం. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో మురుగునీరు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించేందుకు పనులు వేగవంతం చేశారు. వైరాలోని తల్లాడ వెళ్లే జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న ఒక అపార్టుమెంట్‌లోని నివాసాల నుంచి వ్యర్థనీరు ఈ రోడ్డుపైనే కాల్వ మాదిరిగా ప్రవహిస్తుంది. ఏడెనిమిదినెలల నుంచి ఉన్న ఈ సమస్యతో ఆయా పరిసరాల్లోని రెవెన్యూ, రవాణా, ఏసీపీ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, అధికారులు, ఆపరిసరాల్లోని నివాసాల వారు, రోడ్డుపైన తిరిగే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మునిసిపాలిటీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాంతో ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా ఆమురుగునీటిని తొలగించారు. ఇకపోతే వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు నాలుగులైన్ల నిర్మాణంలో భాగంగా రూ.45లక్షలతో విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తగా లైన్లు వేశారు. రెండునెలల నుంచి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళ కారుచీకట్లలో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లడంతో మునిసిపల్, ఆర్అండ్‌బీశాఖల అధికారులను పిలిపించి ఆ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దాంతో మంగళ, బుధవారాల్లో ఓ వైపున అపార్టుమెంట్ ముందు భాగంలోని మురుగునీటిని తొలగించి, మధిర-జగ్గయ్యపేట రోడ్డులో వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నారు. కమిషనర్ చింతా వేణు ఈ రెండు పనులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు.



సిబ్బందికి ఆదేశాలిస్తున్న కమిషనర్ వేణు

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ అరుణ

మధిరటౌన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ జి. ప్రిన్సిపల్ అన్నారు. బుధవవారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతు మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉత్తమ అధ్యాపక బృందం ఉందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని కోరారు. నాణ్యమైన విద్యతో పాటు స్కాలర్‌షిప్ లభిస్తుందని, విద్యార్థులు అనవసరంగా ప్రైవేట్ కళాశాలలో చేరి డబ్బు వృథా చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇందిర, సుజాత, అఫ్రోజ్, అనిత, జ్యోతి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

తల్లాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. మూడునెలలుగా వేతనాలందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురికావల్సి వస్తుందని, అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతినెలా ఒకటోతేదీన వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కోటయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

తల్లాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురంలోని లూర్దుమాత ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు కర్నాటి లక్ష్మారెడ్డి, వేమిరెడ్డి వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి మార్చినెల వరకు ప్రతిరోజూ సాయంత్రం పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీకి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి కటికి వెంకటేశ్వర్లు, కోశాధికారి శీలం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మోటమర్రి వాసికి డాక్టరేట్

బోనకల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మోటమర్రి గ్రామానికి చెందిన నంగెపు వెంకటేశ్వరరావు డాక్టరేట్‌ను సాధించారు. ఆయన జెఎన్‌టీయులో కెమిస్ట్రీ సబ్జక్టులో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తనను ప్రోత్సహించిన తన గురువులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి ఆర్థిక సహాయం

సత్తుపల్లిరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురి కాలనీ 7వ లైన్‌లో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.10,116దాతలు బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు జీవీ.లింగారెడ్డి, హారతి, హనీషా, హార్థిక్‌లను ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించారు.

పథకాల అమలులో కానరాని విధివిధానాలు

సత్తుపల్లిరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్లు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో విధివిధానాలు కానరావడం లేదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వెంకన్న అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కే.యోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రారంభించిన 4కొత్త పథకాలలో నిజమైన లబ్ధిదారులకు చోటివ్వలేదని, అధికారులు సర్వేచేసి అనర్హులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీను, అమర్లపూడి శరత్, తాటి రాజు, దుంపా రాఘవులు, కందిమళ్ల ప్రసాద్, సున్నం కృష్ణ, రాజారావు, ఆదామ్‌సాహెబ్, భాస్కరరావు, కృష్ణ, కిషోర్, అలివేలు, దేవి, దుర్గలు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి



దుకాణదారుడితో మాట్లాడుతున్న మేనేజర్

మధిరటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం మునిసిపల్ సిబ్బంది దుకాణాలకు వెళ్లి వ్యాపారులకు లైసెన్స్ రెన్యూవల్ గురించి తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ రేవతి పాల్గొన్నారు.

జెయింట్‌వీల్ ధరలు తగ్గించాలి

మధిర రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో కొద్దిరోజుల్లో జరుగనున్న శివాలయం జాతర ఉత్సవాల్లో ఏర్పాటుచేసే జెయింట్‌వీల్ రేట్లను తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం సీపీఎం పట్టణ కార్యదర్శి పడకంటి, మండల కార్యదర్శి మందా సైదులు, సీనియర్ నాయకుడు శీలం నర్సింహారావులు మాట్లాడారు. గత కొన్నిసంవత్సరాలుగా శివరాత్రి ఉత్సవాల్లో క్రీడా వస్తువులకు వేలంపాట పాడిన నిర్వాహకులు పెద్ద ఎత్తున రేట్లు వసూలు చేశారని ఆరోపించారు.